

## సైనికా.. సలాం

దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు, వీరసైనికులకు బాసటగా నిలిచేందుకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. -8లో



## రూ.399కే పది లక్షల బీమా

తపాల శాఖలో రూ.399కే పది లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.190 | రూ.260 |
| రెండోరకం | రూ.100 | రూ.186 |



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 143 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 450 | 450 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 88.220 కిలోలు

# ముంచేసిన మిచాంగ్

తుపాను పడగ విప్పి దడదడలాడించింది. ఈదురుగాలులను తోడుగా చేసుకుని పంటలపై విరుచుకుపడింది. చినుకులా రాలడం కాదు.. రైతన్న కంటిమీద కునుకన్నదే లేకుండా వర్ష బీభత్సమే సృష్టించింది. మిచాంగ్ తుపాన్ చేసిన వరద విలయానికి అరటి తోటలు నేలకొరిగాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఊర్లల్లోకి వరద నీరు చేరాయి. వాడల్లో గోడలు కూలాయి. వాగులు, వంకలు ఉప్పొంగాయి. పలు నదులు ఉగ్రరూపం దాల్చాయి. ముఖ్యంగా రైల్వేకోడూరు పరిసర ప్రాంతాల ప్రజలు తుపాను దెబ్బకు చిగురుటాకుల్లా వణికిపోయారు. నేలకొరిగిన పంటల్ని చూసి రైతన్నలు విలవిల్లాడిపోయారు. పొలాల్లో.. కల్లాల్లోని వరి చేన్లను చూసి అన్నదాతల కళ్లల్లో నీళ్లు సుడులు తిరిగాయి. ఇన్నాళ్లు వర్షాభావంతో కుంగిపోయిన పుడమితల్లి బిడ్డలు.. తాజాగా తుపాను మిగిల్చిన గాయంతో నిలువెల్లా మునిగిపోయారు. అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాలో మంగళవారం మిచాంగ్ తుపాను బీభత్సం సృష్టించింది.

- జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- ప్రధానంగా రాజంపేట, కోడూరులో ఉగ్రరూపం
- భారీగా నేలవాలిన అరటి, బొప్పాయి, ఇతర పంటలు
- పెనుగాలులతో పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే, జెడ్పీ చైర్మన్



రైల్వేకోడూరులో పూర్తిగా నేలమట్టమైన అరటి పంట

సాక్షి రాయచోటి: మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఓ వైపు చలిగాలులు.. మరోవైపు ఎడతెరిపి లేని వర్షం ప్రజలను ఇబ్బందులకు గురి చేసింది. మంగళవారం మధ్యాహ్న సమయంలో కాసేపు సూరీడు దర్శనమిచ్చినా కొద్దిసేపటి తర్వాత ఆకాశం మేఘావృతమై యథావిధిగా వర్షం కురుస్తోంది. సిద్దవటం సమీపంలోని లెవెన్త్ బెటాలియన్‌లో విధులకు హాజరయ్యేందుకు వెళుతున్న హెడ్ కానిస్టేబుల్‌పై చెట్టు విరిగిపడడంతో మృతి చెందగా, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతంలో పెనుగాలులకు అరటి, బొప్పాయి, తమలపాకు తొటలు నేల వాలాయి.

**'పింఛా'కు వరద నీరు..గేట్లు ఎత్తి విడుదల**

అన్నమయ్య జిల్లాలోని సుండుపల్లె సమీపంలో ఉన్న పింఛా ప్రాజెక్టుకు వరద నీరు పోటెత్తింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు పింఛాకు పోటెత్తడంతో ఇరిగేషన్ అధికారులు రెండు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. పింఛా ప్రాజెక్టులో చాలా రోజుల తర్వాత వరద నీటి ప్రవాహం కనిపించింది. రైల్వేకోడూరు ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు గుంజనేరు, పుల్లంగేరు వాగులు నీటితో ఉరకలెత్తుతున్నాయి.

**పండ్ల తోటలకు భారీ నష్టం:** అన్నమయ్య జిల్లాలో మిచాంగ్ తుపాను ప్రభావంతోపాటు పెనుగాలులతో పండ్ల తోటలకు భారీ నష్టం వాటిల్లింది. ప్రధానంగా రైల్వేకోడూరు పరిధిలోని పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరుతోపాటు రాజంపేట నియోజకవర్గంలోని వీరబల్లి, రాజంపేట తదితర ప్రాంతాల్లో అరటి పంటకు భారీ నష్టం వాటిల్లింది. సుమారు 3893 ఎకరాల్లో అరటిపంట నేల కొరిగినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే మదనపల్లె ప్రాంతంలో వరికి సంబంధించి కూడా 150 ఎకరాల్లో పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాల్లో సుమారు 75 ఎకరాల్లో బొప్పాయి, 83 ఎకరాల్లో తమలపాకు పంటలు దెబ్బతిన్నట్లు అంచనా వేస్తున్నారు. అంతేకాకుండా టమోటా, కూరగాయ పంటలు, ఇతర పంటలకు కూడా కొంతమేర నష్టం వాటిల్లింది. అలాగే పీలేరు మండలం మేళ్ల చెరువు పంచాయతీలో తుపాను ప్రభావంతో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ కూలి ఆవు మృతి చెందింది. తుపాను కారణంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు నేలకూలి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. విద్యుత్ అధికారులు, సిబ్బంది వెంటనే స్పందించి ఆయా ప్రాంతాలకు చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

## ఉప్పొంగిన గుంజన నది

పెనగలూరు (ఓబులవారిపల్లె):మండలంలో కురిసిన భారీ వర్షాలకు గుంజన నది ఒక్కసారిగా ఉప్పొంగి పోవడంతో మంగళవారం 30 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. ఆదివారం నుంచి కురిసిన భారీ వర్షాలకు సోమవారం అర్ధరాత్రి గుంజన నది ఒక్కసారిగా ఉప్పొంగి ప్రవహించింది. ఈటమాపురం -సింగనమల తారురోడ్డుపై భారీగా వరద నీరు పారడంతో రాకపోకలు స్తంభించాయి. అలాగే మూగవారిపల్లి లోలెవల్ బ్రిడ్జిపై గుంజన నది రావడంతో ముపై గ్రామాల ప్రజలు బయట ప్రాంతానికి వచ్చేందుకు అవకాశమే లేకుండా పోయింది. మూగవారిపల్లి, నాయుడువారిపల్లి, ఈటమాపురం, తూర్పుపల్లి, కురవల్లు, గట్టువారిపల్లి, వెలగచర్ల, దామనచెర్ల, వీఎంపురం, ఉప్పరపల్లి, రెడ్డివారిపల్లి, అగ్రహారం, తిరణంపల్లి, సిరివరం గ్రామాల తోపాటు దళితవాడలు, అరుంధతివాడలు, ఎస్టీ కాలనీలతోపాటు కట్టావారిపల్లి పంచాయతీలోని కట్టావారిపల్లి, అప్పారాజుపేట, ఆర్ కమ్మపల్లి, రేగుంటవారిపల్లి, మల్లాలమ్మ దిన్నెలతోపాటు దళితవాడ గ్రామాలకు రాకపోకలు స్థంభించాయి.

## చెట్టు విరిగిపడి కానిస్టేబుల్ దుర్మరణం

సిద్దవటం సమీపంలోని లెవెన్త్ బెటాలియన్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సత్యకుమార్ చెట్టు విరిగి మీద పడడంతో దుర్మరణం చెందారు. చెన్నూరుకు చెందిన సత్యకుమార్ ఉదయం విధులను నిర్వర్తించేందుకు బైక్‌పై వెళ్తుండగా మలినేనిపట్నం గ్రామ సమీపానికి రాగానే కానిస్టేబుల్‌పై చెట్టు విరిగి పడడంతో మృతి చెందాడు. అధికారులు మృతుని కుటుంబ సభ్యులకు తమ సంతాపాన్ని తెలియజేశారు.



బైక్‌పై విరిగిపడిన చెట్టు (ఇన్‌సెట్) మృతిచెందిన కానిస్టేబుల్ సత్యకుమార్



వాల్మీకిపురం: పంట నష్టాన్ని చూపుతున్న రైతు



వైఎస్సార్ జిల్లా అట్లూరులో నీట మునిగిన దోస పంట



ఉప్పొంగిన గుంజన నది



రాజంపేట రూరల్: హస్తవరంలో నేలవాలిన వరి



పెనగలూరు మండలం నారాయణ నెల్లూరు వద్ద పడిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



రైల్వేకోడూరులో నేలకొరిగిన అరటిని పరిశీలిస్తున్న కలెక్టర్‌పీఎస్ గిరీషా, ఎమ్మెల్యే కొరముట్ల

## దెబ్బతిన్న పంటల పరిశీలన

జిల్లాలోని రైల్వేకోడూరు ప్రాంతంలో పెనుగాలులకు నేలకొరిగిన పండ్ల తోటలను మంగళవారం కలెక్టర్ పీఎస్ గిరీషా, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు పంజం సుకుమార్‌రెడ్డి పరిశీలించారు. అలాగే రాజంపేట మండల పరిధిలో నేలకొరిగిన పంటలు, వాగులను జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులురెడ్డితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. ఆదుకుంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. పంట నష్టాల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని ప్రజాప్రతినిధులు రైతులకు ధైర్యం చెప్పారు.



గుంటిమడుగులో ధ్వంసమైన అరటితోటను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి



వైఎస్సార్ జిల్లా కలసపాడులో నేలకొరిగిన మొక్కజొన్న పంట

## న్యూస్‌రీల్

### రామయ్య సన్నిధిలో బాలకిరణ్



బాలకిరణ్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులను మంగళవారం తెలుగు రాష్ట్రాల జనన, మరణ ధృవీకరణ రిజిస్ట్రేషన్ డైరెక్టర్ (ఐఏఎస్ సెంట్రల్ అధికారి) బాలకిరణ్ సతీ సమేతంగా దర్శించుకున్నారు. గర్భాలయంలోని మూల విరాట్‌కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, స్వామి వారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. వీరి వెంట ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్, జిల్లా వైద్య అధికారి డాక్టర్ నాగరాజు, మండల వైద్యాధికారి శ్వేత ఉన్నారు.

### యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు

కడప కార్పొరేషన్: తుపాను వల్ల జిల్లాలో కొన్ని చోట్ల విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. ఆ ప్రాంతాల్లో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ మంగళవారం పర్యటించారు. దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను వెంటనే మార్చాలని ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా గృహ, నీటి అవసరాలకు విద్యుత్‌ను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించాలన్నారు. ఎక్కడైనా తెగిపడిన విద్యుత్ లైన్లు ఉంటే ప్రజలు వాటిని తగలకుండా.. విద్యుత్ అధికారులు, సిబ్బందికి ఫోన్ చేయాలన్నారు. లేదా టోల్ ఫ్రీ నంబర్ 1912కు తెలియజేయాలన్నారు. వర్షాలు పడేటప్పుడు విద్యుత్ స్తంభాలను తాకవద్దని, సొంతంగా విద్యుత్ సరఫరాను ఆపివేయడం, ఆన్ చేయడం వంటివి చేయరాదని చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్త జీవరాశికి ఆధారం నేల.. నీరు

రాయచోటిటౌన్: సమస్త జీవరాశికి ఆధారం నీరు – నేలేనని అన్నమయ్యజిల్లా వ్యవసాయశాఖ అధికారి బి. చంద్రనాయక్ అన్నారు. మంగళవారం రాయచోటి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో ప్రపంచ మృత్తికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు, రైతులకు అవగాహన కల్పించారు. నేల సారవంతంగా ఉన్నప్పుడే పంటలు పండుతాయని, పంటలు పండాలంటే నీరు చాలా అత్యవసరమని తెలిపారు. రసాయినిక ఎరువులు వాడకం వలన నేల సారవంతం తగ్గిపోయి విషతుల్యం అవుతోందన్నారు. సేంద్రియ పద్ధతి ద్వారా వ్యవసాయం చేయడం వలన నేలతల్లిని సారవంతంగా ఉంచుకోవడంతో పాటు సురక్షతంగా ఉండే విధంగా ప్రయత్నించవచ్చుని వివరించారు. ఆర్‌బీకే ఏడీఏ శ్రీలత, ఏవోలు, ఇతరా అధికారులు పాల్గొన్నారు.



మట్టిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయఅధికారి చంద్ర నాయక్

## నైపుణ్యం ఉంటేనే రాణిస్తారు

కడప ఎడ్యుకేషన్: సమయపాలన , నిరంతర సాధన చేస్తూ నైపుణ్యం పొందినవారే రాణిస్తారని యోగివేమన విశ్వ విద్యాలయం ప్రధానాచార్యులు రఘునాథరెడ్డి అన్నారు. కెరీర్ అభివృద్ధి కోసం ఉపాధి నైపుణ్యాలు అనే అంశంపై రెండు రోజుల జాతీయ కార్యశాల ముగింపు సమావేశం ఉప ప్రధానాచార్యులు ఆచార్య శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రఘునాథరెడ్డి మాట్లాడుతూ సానుకూల దృక్పథం అలవర్చుకోవాలన్నారు. మంచి విషయాలను వెంటనే అమల్లోకి తీసుకోవాలన్నారు. అందివచ్చిన అవకాశాలను వెంటనే సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన తుంకూరు విశ్వవిద్యాలయం ఆచార్యులు సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ విధుల్లో రాణించాలన్నా నైపుణ్యాలు ముఖ్యమన్నారు. సృజనాత్మకత లేనివారు పోటీ ప్రపంచంలో రాణించలేరన్నారు.డాక్టర్ రియాజున్నీసా తదతరులు పాల్గొన్నారు.

## పింఛాకు జలకళ!



పింఛా డ్యాంలో నాలుగుగేట్లు ఎత్తివేసిన దృశ్యం

రాజంపేట: అన్నమయ్య, చిత్తూరు జిల్లాల సరిహద్దు ప్రాంతంలోని పింఛా జలాశయానికి జలకళ ఉట్టిపడుతోంది. చిత్తూరు జిల్లాలోని క్యాచ్‌మెంట్ ఏరియా తలకోన, ఏనుబోతుల వంకల నుంచి వరదనీరు డ్యాంలో వచ్చి చేరుతుంది. కాగా జలాశయం పునరుద్ధరణ కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన రూ.80కోట్ల పనులు యథావిధిగా జరుగుతున్నాయి. వరదనీటి వల్ల ఎలాంటి ఆటంకంలేదని ఈ ఈ వెంకట్రామయ్య స్పష్టంచేశారు.

**నాలుగుగేట్లు ఎత్తివేత:** డ్యాంలో నీటిమట్టం గణనీయంగా పెరిగింది. ఉదయం 1600 క్యూసెక్కులు వచ్చి చేరుకుంది. దీంతో డ్యాంలో ఉన్న నాలుగు గేట్లను ఎత్తి దిగువకు 1400 క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి జలాశయం స్థితిగతులు, పునరుద్ధరణ పనులపై జలాశయం అధికారులతో మాట్లాడుతూ మానిటరింగ్ చేస్తున్నారు.

**లెఫ్ట్ కెనాల్‌లో నీటి విడుదల:** పింఛా జలాశయానికి సంబంధించి లెఫ్టకెనాల్‌లో 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా రైట్‌కెనాల్ డ్యామేజి కావడం వల్ల నీటిని విడుదల చేయలేకపోయారు.

**జనవరి చివరినాటికి అందుబాటులోకి పింఛా**

జనవరి చివరినాటికి పింఛా జలాశయం అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే 70శాతం పనులు పూర్తి అయ్యాయి. డిజైన్ మార్పు ఫలితంగా వచ్చిన గ్యాలరీ నిర్మాణం అదనంగా చేయాల్సి వచ్చింది. కాంక్రిట్, రింగ్‌బండ్ లాంటి పునరుద్ధరణ పనులు పూర్తికావచ్చాయి. జలాశయం పూర్తయితే సాగునీటి,తాగునీటికి కష్టాలుతీరినట్లే. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు.

–మేడా మల్లికార్జునరెడ్డి, ఎమ్మెల్యే రాజంపేట

# వ్యవసాయానికి.. ఉపాధి!

- ఉపాధి పథకంలో పాత పనులకు స్వస్తి
- కొత్తగా వ్యవసాయ పనులకు ప్రాధాన్యత

బి.కొత్తకోట: జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇకపై వ్యవసాయ పనులకే ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధి హామీ పథకం ద్వారా రైతుల జీవన ప్రమాణాల పెంపుదల, సుస్థిర ఆస్తుల కల్పన, నికర ఆదాయ మార్గాల పెంపుదల లక్ష్యంతో సేద్యానికి అగ్రస్థానం కల్పిస్తోంది. అలాగే గ్రామాభివృద్ధికి తోడ్పడే పనులు ఉపాధి హామీ పథకంలో చేసుకోవచ్చు. దీనికోసం క్షేత్రస్థాయిలో ఉపాధి హామీ పథకం అధికారులు ప్రణాళికలతో కూలీలు, రైతాంగానికి తెలిసేలా ప్రచారం కోసం కరపత్రాలను సిద్ధం చేస్తున్నారు. ఉపాధి పనికి రోజువారి కూలీ రూ.272, వందరోజులు పనిపూర్తి చేసుకుంటే రూ.27,200 లబ్ది కలుగుతుంది. ఇప్పటిదాక చెరువులు, కాలువల్లో పూడికతీత, కొండల్లో ట్రెంచీల పనులు చేసేవారు.




ఉపాధిలో పండ్ల తోటల పెంపకం

| | |
|---|---|
| రిజిస్టర్ అయిన జాబ్‌కార్డుల సంఖ్య: | 2,50,019 |
| యాక్టివ్ జాబ్‌కార్డుల సంఖ్య : | 2,06,056 |
| పనులకు హాజరైన జాబ్‌కార్డుల సంఖ్య : | 1,53,416 |
| జాబ్‌కార్డులకు పనిదినాల కల్పన : | 78,85,726 |
| 2023-24 ఏడాదికి చేసిన ఖర్చు : | రూ.28,268.33 లక్షలు |

### ఉపాధిలో ఇకపై జరగబోయే పనులు ఇవే..

- చిన్న, సన్నకారు (ఐదెకరాల లోపు భూమి కలిగిన) రైతులకు వందశాతం రాయితీతో మామిడి, జామ, చింత, అల్లనేరేడు, నిమ్మ, సపోటా, కొబ్బరి, సీతాఫలం, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, బత్తాయి, ఉసిరి, మునగ, పశుగ్రాసం, మల్లెపూల తోటల పెంపకం. వీటికి రెండు నుంచి మూడు ఏళ్ల వరకు పూర్తి నిర్వహణ ఖర్చులు చెల్లింపు.
- ఇప్పటికే పండ్లతోటలు ఏర్పాటు చేసుకొన్న రైతులకు పొలంగట్ల వెంబడి టెంకాయచెట్లు, చింత మొక్కలు తదితర ఉద్యానవన పంటలకు నిర్వహణ ఖర్చులు చెల్లిస్తారు.
- పొలంగట్ల వెంబడి టేకు, మహాగని, సిల్వర్‌ఓక్, ఎర్రచందనం, కలప మొక్కలను పెంచితే రెండేళ్లపాటు పూర్తి నిర్వహణ ఖర్చులను చెల్లిస్తారు.
- పట్టుగుళ్ల పెంపకం చేపట్టిన రైతులకు బుష్ ప్లాంటేషన్, సెరికల్చర్ ప్లాంటేషన్ చేపట్టేందుకు రెండేళ్లపాటు నిర్వహణ ఖర్చులను చెల్లిస్తారు.
- పశువులు, గేదేలు, గొర్రెలు, మేకలు కలిగిన రైతు కుటుంబాలు గడ్డి పెంపకం కోసం రెండేళ్లపాటు నిర్వహణ చేసుకునేందుకు అయ్యే వ్యయం చెల్లిస్తారు.
- గ్రామాల్లో మురుగునీరు రోడ్లపై నిల్వ లేకుండా దుర్వాసన, దోమల బెడద లేకుండా చేసుకునేందుకు సోక్‌పిట్స్ ఏర్పాటు. రోడ్లకు ఇరువైపులా మొక్కల పెంపకం.
- ఇకపై ఉపాధి హామీ పథకం కూలీలకు ముఖ ఆధారిత హాజరు ఉంటుంది. దీంతోపాటు మరిన్ని పనులు మార్గదర్శకాల్లో ఉన్నాయి.

### రైతులు బాగుపడాలి



తంబళ్లపల్లె నియోజకవర్గ రైతులు ఉపాధి పథకాన్ని వ్యవసాయ పనులకు సద్వినియోగం చేసుకోవాలి. కరువు పరిస్థితులతో ఇబ్బంది పడుతున్న రైతాంగానికి ఇది సదావకాశం. వ్యవసాయానికి ఉపాధి పనులు కల్పించడం ద్వారా ఎంతో ప్రయోజనం కలుగుతుంది. పండ్లతోటలు, వర్షపునీటి సద్వినియోగం పనులకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలి.

–పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే

### రైతులకు ఉపయోగం



ఉపాధి పనుల్లో మారిన ప్రణాళిక మేరకు రైతులకు ఉపయోగపడే, ఆర్థికాభివృద్ధి సాధించే పనులకే ప్రాధాన్యత ఇస్తాం. నిధులు సద్వినియోగం అవ్వడం ద్వారా వ్యవసాయానికి ప్రయోజనం కలుగుతుంది.

–ఎస్.మధుబాబు, డ్వామా ఏపీడీ, ములకలచెరువు

# సైనికా.. సలాం!

మాతృభూమి కన్నతల్లితో సమానం.. భూమాత ఒడిలో ప్రజలందరూ ఎళ్లవేళలా క్షేమంగా ఉండాలని దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాస్తున్నారు భారత సైనికులు. భరతమాత సేవకు జీవితం అంకితం చేస్తున్నారు. కుటుంబం, బంధుత్వాలు, సుఖాలకు దూరంగా ఉంటూ దేశ రక్షణే లక్ష్యంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం ఉంది. ఇప్పుడు అటువంటి సైనికుల పట్ల మనకు ఉన్న గౌరవాన్ని సైనికుల కుటుంబాలకు మేము న్నామంటూ తమవంతు చేయూతనిచ్చే అవకాశం వచ్చింది.. డిసెంబర్ 7వ తేదీని ఫ్లాగ్ డే పేరుతో సాయుధ దళాల దినోత్సవంగా నిర్వహించుకుంటాం.

## రేపు సాయుధ దళాల పతాక దినోత్సవం

కడప స్పోర్ట్స్ : దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరులు, యుద్ధసమయంలో అవయవాలను కోల్పోయిన వీరసైనికులకు బాసటగా నిలిచేందుకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. 1949 డిసెంబర్ 7న త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. అయితే 1993లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ పేరుతో నిధిని ఏర్పాటు చేశారు. దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అప్పటి నుంచి ప్రతియేటా డిసెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహించి 7వ తేదీన ఫ్లాగ్ డేగా ప్రజలు, సంస్థల నుంచి విరాళాలు సేకరిస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ రంగాలకు చెందిన సైనికులు, వారి కుటుంబీకులు, వితంతువులకు చేయూతనిచ్చేందుకు విరాళాలను సేకరిస్తారు. విరాళాల ద్వారా వచ్చిన సొమ్మును అధికారుల ద్వారా వైకల్యం పొందిన మాజీ సైనికులు/వారి కుటుంబ సభ్యులు, వితంతువులకు అందజేస్తారు.



కడప నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం




విరాళాలు సేకరిస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్ (ఫైల్‌ఫొటో)

**పతాక దినోత్సవం విశిష్టత..**

దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీరజవాన్‌లను, త్రివిధ దళాలలో ఉంటూ దేశ సరిహద్దులను కాపాడటంలో నిరంతరం సేవలందించే సైనికులను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునే రోజే త్రివిధ సాయుధ దళాల పతాకదినోత్సవం. ఆ రోజు విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్ ప్రజలకు పతాకాన్ని అందించి హుండీ ద్వారా విరాళాలు స్వీకరిస్తారు. దీంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా విరాళాలను పంపవచ్చు. ప్రజలు ఎవరైనా మాజీ సైనికులకు చేయూతనివ్వదలచిన వారు కడప నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు ఎదురుగా, స్పెన్సర్ వెనుకభాగాన, కడపలో అందజేసి రశీదు పొందవచ్చు. అదే విధంగా డీడీ రూపంలో కానీ, ఈసీఎస్ ద్వారా కానీ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంజీ రోడ్, విజయవాడ, అకౌంట్ నెంబర్ 33881128795, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0016857కు పంపవచ్చు. విరాళాలు ఇచ్చేవారికి సెక్షన్ 80 జి ఆదాయపు పన్ను చట్టం కింద పన్ను నుంచి మినహాయింపు ఉంటుంది.

**దేశసైన్యంలో జిల్లాలో ప్రాతినిధ్యం..**

దేశ సైన్యంలో వైఎస్ఆర్ జిల్లాకు ప్రత్యేకస్థానం ఉంది. బద్వేలు నియోజకవర్గ పరిధిలో కొన్ని గ్రామాల్లో ప్రతి వీధిలో ఒక సైనికుడు ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఇప్పటికే వేల సంఖ్యలో సైన్యంలో జిల్లా వాసులు పనిచేయడం మన జిల్లాకు దక్కిన గౌరవం. జిల్లా వ్యాప్తంగా త్రివిధ దళాల్లో 4400 మంది మాజీ సైనికులు పనిచేసి ఉన్నారు. వీరిలో ఆర్మీలో 4151, ఎయిర్‌ఫోర్స్‌లో 175 మంది, నేవీలో 74 మంది ఉన్నారు. వీరితో పాటు సైన్యంలో కుటుంబ సభ్యులను కోల్పోయిన వితంతువులు ఆర్మీలో 921 మంది, ఎయిర్‌ఫోర్స్‌లో 45 మంది, నేవీలో 16 మంది ఉన్నారు. వీరితో పాటు రెండవ ప్రపంచ యుద్ధానికి సంబంధించిన వితంతువులు 14 మంది ఉన్నారు. అయితే వీరందరికి ప్రభుత్వ పరంగా పలు ప్రయోజనాలు లభిస్తున్నప్పటికీ వారి సేవలకు ఎంతచేసినా తక్కువే అన్నభావనతో పౌరులు స్పందించి తోచిన సాయం చేసి సైనికులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే యత్నమిది.

### సైనికుల త్యాగనిరతిని స్మరించుకుందాం..



దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన వీరసైనికులను, వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నాం. ఇందుకోసం ఎన్‌సీసీ కేడెట్స్ సేవలను ఉపయోగించుకుని 7వ తేదీ పతాక దినోత్సవం రోజున ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తాం. దేశసైనికులు చేసిన సేవలకు వెలకట్టలేం. తోచిన సాయం చేసి వారి కుటుంబాలకు మేమున్నామన్న భరోసా కల్పించడమే లక్ష్యం.

– ఐ.జి.రఘురామయ్య, జిల్లా సైనిక సంక్షేమాధికారి, కడప

## క్లుప్తంగా

### భార్యపై భర్త దాడి

మదనపల్లె : కుటుంబ కలహాలతో భార్యపై భర్త దాడిచేసిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. కొత్తపల్లె రాజారెడ్డి కాలనీకి చెందిన ఎస్.ముంతాజ్(35)కు తన భర్త సద్దాంహుస్సేన్‌తో గత కొంతకాలంగా విభేదాలు ఉన్నాయి. మంగళవారం భార్యాభర్తల మధ్య గొడవ పెద్దదై, భర్త సద్దాం హుస్సేన్ భార్య ముంతాజ్‌పై దాడికి పాల్పడ్డాడు. దాడిలో ఆమె తీవ్రంగా గాయపడగా, స్థానికులు ఆమెను స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

### తమ్ముడిపై అన్న..

మదనపల్లె : స్థల వివాదంతో తమ్ముడిపై అన్న కత్తితో దాడిచేసిన ఘటన మంగళవారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. బండమీదపల్లె పంచాయతీ తురకపల్లెకు చెందిన సయ్యద్ ఖాదర్ కుమారుడు సయ్యద్ నసీం(27) మంగళవారం గ్రామంలోని ఇంటివద్ద తన తల్లితో మాట్లాడుతుండగా, అన్న సయ్యద్‌వసీం అకస్మాత్తుగా కత్తితో తమ్ముడు నసీంపై దాడికి పాల్పడ్డాడు. దాడిలో తమ్ముడు నసీం తీవ్రంగా గాయపడగా, స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఇంటిస్థలం వివాదం కారణంగా తన అన్న దాడికి పాల్పడినట్లు నసీం తెలిపాడు. ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు సమాచారాన్ని పెద్దమండ్యం పోలీసులకు తెలిపారు.

### ద్విచక్రవాహనాలు ఢీకొని ముగ్గురికి గాయాలు



గాయపడిన రాజేంద్ర ప్రసాద్, ఆంజనేయులు


రాజా

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లి–రాయచోటి మార్గ మధ్యంలోని మిస్సచర్చి వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. కస్తూరి రాజుగారిపల్లె గ్రామం, ఎస్సీ కాలనీకి చెందిన వి.రాజేంద్ర ప్రసాద్, ఆంజనేయులు ద్విచక్రవాహనంలో వెళుతుండగా ఆదే గ్రామానికి చెందిన రాజా అనే వ్యక్తి మరో ద్విచక్ర వాహనంలో వెళ్తున్నాడు. మార్గమధ్యంలో రెండు వాహనాలు ఢీ కొనడంతో ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు వైద్యులు తెలిపారు.

### రైలు ఢీకొని వ్యక్తి మృతి

ముద్దనూరు : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో బలరాముడు(53)అనే వ్యక్తి రైలు ఢీకొని దుర్మరణం చెందాడు. ఎర్రగుంట్ల రైల్వే ఎస్ఐ రారాజు సమాచారం మేరకు నంద్యాల జిల్లా ఉయ్యాలవాడ మండలం కంబాలదిన్నె గ్రామానికి చెందిన బలరాముడు కర్ణాటక రాష్ట్రంలోని హొస్పేట వద్ద స్టీల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. మంగళవారం బస్సు దిగి స్థానిక రైల్వే స్టేషన్‌లో ఇంటర్ సిటీ రైలులో ప్రయాణించడానికి రైల్వేస్టేషన్‌కు వెళ్తున్నాడు. స్థానిక రైల్వే గేటు సమీపంలో వెళ్తుండగా వెనుక వైపునుంచి వస్తున్న రైలు బలరాముడును ఢీకొంది. ఈ ఘటనలో అతను దుర్మరణం చెందాడు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నవశకం



### ఒక్కరోజులోనే కుల ధ్రువీకరణ పత్రం



జగనన్న పుణ్యమా అని ఒక్క రోజులోనే కుల ధ్రువీకరణ పత్రం అందింది. గతంలో ఏదైనా సర్టిఫికెట్ కావాలంటే కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా సమయంలో అందేవికావు. అయితే జగనన్న సురక్ష కార్యక్రమంలో ఒక రోజులోనే సులభంగా సర్టిఫికెట్ అందించారు. ఎలాంటి వ్యయ ప్రయాసాలు లేకుండా ఇంటి వద్దకే సేవలందిస్తున్న జగనన్నకు రుణపడి ఉంటాం.

– టి. లక్ష్మీదేవి, బండ్లవంక, పీలేరు.

### సొంతిల్లు కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం



నా భర్త ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అరకొర ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. పిల్లల చదువుకు, ఇంటి బాడుగలు చెల్లించలేక నానా ఇబ్బందులు ఎదుర్కొనే వాళ్లం. గతంలో పలు మార్లు ఇంటి కోసం అర్జీలు పెట్టుకున్నా పట్టించుకునే దిక్కులేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత కార్యాలయాల చుట్టూ తిరగకుండానే గ్రామ వలంటీర్ ద్వారా దరఖాస్తు చేసుకున్నాను. సులభతరంగా ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం పూర్తి చేసుకున్నాం. సొంతిల్లు కల్పించిన జగనన్నకు రుణపడి ఉంటాం.

– ఎస్. సుధాంజలి, ఆయిల్‌సీడ్స్ లేఅవుట్, పీలేరు.

### మా బిడ్డను చదివిస్తున్నాం



మాది పేద కుటుంబం. నా భర్త రఫీ చికెన్ అంగడిలో పని చేస్తున్నారు. నాకు ఇద్దరు పిల్లలు. పెద్ద పాప సనా, చిన్నపాప రజియా. పిల్లలను చదవించుకోవాలంటే కష్టంగా ఉండేది. పాఠశాల తెరిచే రోజుకు దుస్తులు, పుస్తకాలు కొనాలంటే అప్పులు చేయాల్సి వచ్చేది. జగనన్న సీఎం అయిన వెంటనే మా బిడ్డ సనాకు అమ్మఒడి కింద డబ్బులు వచ్చాయి. స్థానిక ఉర్దూ మున్సిపల్ పాఠశాలలో చదువుతోంది. పాఠశాలలో జగనన్న విద్యాకానుక కింద పుస్తకాలు, దుస్తులు అన్ని ఇచ్చారు. సంతోషంగా మా బిడ్డను చదివిస్తున్నా. సీఎంకు రుణపడి ఉంటాం.

– షహరాబాను, బాపనకాలువ, మదనపల్లె.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్, జేసీబీ

నందలూరు(రాజంపేట) : అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారికి తహసీల్దార్ భారీ జరిమానా విధించారు. వివరాలు ఇలా.. మండల పరిధిలోని లేబాక గ్రామ పంచాయతీలో ఉన్న చెరువు, పరిసర ప్రాంతాలలో అదే గ్రామానికి చెందిన కొంతమంది ఒక జేసీబీ, నాలుగు ట్రాక్టర్లతో అక్రమంగా మట్టిని రవాణా చేస్తున్నారు. ఈ విషయం ఆదివారం సాయంత్రం తహసీల్దార్ వైఏ సత్యానంద దృష్టికి వెళ్లింది. దీంతో ఆయన ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది వెళ్లి నాలుగు ట్రాక్టర్లను, జేసీబీని స్వాధీనం చేసుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. సోమవారం తహసీల్దార్ వారిని విచారించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 10వేలు చొప్పున మొత్తం రూ. 40 వేలు, జేసీబీకి రూ. 50 వేలు జరిమానా విధించారు. అనుమతి లేకుండా ఎవరైనా అక్రమ రవాణా చేపడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తహసీల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మోహన్ కృష్ణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుశీల్ కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం నాయునిచెరువుపల్లెకు చెందిన కృష్ణప్ప కుమారుడు నవదీప్ స్థానిక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. చదువుపై సరిగ్గా శ్రద్ధ పెట్టకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దీంతో ఇంటి సమీపంలో జిల్లేడు పాలు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదేవిధంగా పుంగనూరు మండలం ఈడిగపల్లె పంచాయతీ ఆరంట్లపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు అంజప్ప(33) వివాహ భోజనాల క్యాటరింగ్‌కు వెళుతూ జీవిస్తున్నాడు. స్థానికంగా రూ.20వేలు అప్పుచేశాడు. మంగళవారం అప్పు ఇచ్చిన వ్యక్తి భార్య అప్పు వసూలుకు వచ్చి దూషించడంతో మనస్తాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ వాహనాల ద్వారా మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## జనన, మరణ నమోదు బాధ్యతగా చేపట్టాలి

- రాష్ట్ర జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ పి. బాలకిరణ్
- సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం (సి.ఆర్.ఎస్)పై రిమ్స్‌లో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ పి. బాలకిరణ్

కడప అర్బన్ : ప్రతి ఆరోగ్య కేంద్రంలో జనన, మరణ నమోదు ప్రక్రియను విధిగా, బాధ్యతగా చేపట్టాలని ఏపీ, తెలంగాణ ఉభయ రాష్ట్రాల జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ పి. బాలకిరణ్ వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం రిమ్స్ మెడికల్ కళాశాలలో సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సీఆర్ఎస్) అమలు, నిర్వహణపై జీజీహెచ్ సూపరింటెండెంట్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జనన, మరణ గణాంకాల శాఖ డైరెక్టర్ హాజరయ్యారు. జిల్లాలోని అన్ని రిజిస్ట్రేషన్ యూనిట్లను కలిగిన ఆరోగ్య కేంద్రాల్లో, జనన మరణ రిజిస్ట్రేషన్ ప్రక్రియను విధిగా, బాధ్యతగా నిర్వహించాలన్నారు. అందుకోసం వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జనన, మరణాల రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మూడు అంచెల ఉద్దేశాలున్నాయన్నారు. అందులో ఒకటి చట్ట సంబంధిత, రెండవది పరిపాలన సంబంధిత, మూడవది గణాంక సంబంధిత అంశాలన్నారు. జననాల రిజిస్ట్రేషన్ రికార్డు అనేది వ్యక్తి జన్మస్థల, జన్మదినానికి ఒక చట్టపరమైన ధృవపత్రాన్ని చేకూర్చగలదన్నారు. మరణాల రిజిస్ట్రేషన్ రికార్డు వ్యక్తిపై ఆధారపడ్డ వారికి ఆస్తి, జీవిత బీమా పంపకాలలో ఉపయోగపడుతుందన్నారు. గణాంక సంబంధిత ప్రయోజనాలలో కాన్పులు, మరణాల సమాచారం, జనాభా వృద్ధిలోని ప్రవృత్తిని అర్థం చేసుకోవడానికి. జనాభా వృద్ధి ప్రక్షేపించడానికి ఉపయోగపడుతుందన్నారు. కడప నగర కమిషనర్, రిమ్స్ ప్రత్యేకాధికారి జి. సూర్యసాయి ప్రవీణ్ చంద్ మాట్లాడుతూ జిల్లా జనాభా 22,13, 911 కాగా జిల్లాలోని 36 మండలాలలో మొత్తం 618 జనన, మరణ నమోదు యూనిట్లు ఉన్నాయన్నారు. అందులో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 62 కాగా, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలో 8, గ్రామ పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో 548 రిజిస్ట్రేషన్ యూనిట్లు ఉన్నాయన్నారు. పట్టణ ప్రాంతాల్లో చూస్తే కడప నగరంలోనే 49 సీఆర్ఎస్ రిజిస్ట్రేషన్ యూనిట్లు, ప్రొద్దుటూరులో 40 సీఆర్ఎస్ ఉన్నాయన్నారు. రిమ్స్ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ రిమ్స్ లేబర్ రూమ్ రిజిస్టర్‌లో అన్ని జననాలకు సంబంధించిన మాస్టర్ రికార్డ్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు, రిమ్స్ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.సురేఖ, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై. శ్రీనివాసులు, ఎమర్జెన్సీ విభాగాధిపతి డాక్టర్ ఎం. సురేశ్వర్ రెడ్డి, అన్ని విభాగాల హెచ్‌ఓడీలు తదితరులు పాల్గొన్నారు.



## రూ. 399కే పది లక్షల ప్రమాద బీమా

– తపాలశాఖ ఎస్పీ రాజేష్


మాట్లాడుతున్న తపాలశాఖ ఎస్పీ రాజేష్

రాజంపేట టౌన్ : తపాల శాఖలో రూ.399కే పది లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆ శాఖ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. స్థానిక హెడ్‌పోస్టాఫీసులో మంగళవారం తపాల ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అతి తక్కువ నగదుతో పెద్దమొత్తంలో బీమా సౌకర్యాన్ని పొందే అవకాశాన్ని తపాలశాఖ కల్పిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు తమకు సమీపంలో ఉన్న తపాల కార్యాలయాలకు ఆధార్‌కార్డు, నగదును తీసుకెళితే తమ సిబ్బంది బీమాకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేస్తారని తెలిపారు. ముఖ్యంగా కుటుంబ యజమానికి ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే ఈ బీమా ఆ కుటుంబానికి ఆర్థిక భరోసాగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ అమరనాథ్‌రెడ్డి, పోస్టుమాస్టర్ హబీబుల్లా పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


చేపల వేటకు వెళ్లి మృతి చెందిన కిరణ్‌కుమార్

మదనపల్లె : చేపలు పట్టేందుకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందిన సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణంలోని రామాలయంవీధి డీఎస్పీ బంగ్లా వెనుక నివాసం ఉన్న గరుడప్ప కుమారుడు మంచూరి కిరణ్‌కుమార్(48) టైర్ రీట్రేడింగ్ వర్క్ చేస్తూ జీవిస్తున్నాడు. ఇతను సోమవారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడు. అయితే రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతడి కోసం గాలించినా ప్రయోజనం లేకపోయింది. మంగళవారం ఉదయం మండలంలోని బసినికొండ గ్రామం నక్కలకుంట వద్ద ఓ వ్యక్తి మృతదేహం నీటిపై తేలాడుతుండటం స్థానికులు గమనించారు. కుంటపక్కనే ద్విచక్రవాహనం ఉండటంతో తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే తాలూకా సీఐ ఎస్.శేఖర్, ఎస్ఐ సుధాకర్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతుడి వివరాలు స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు వచ్చి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మోహనకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నెలకొంది.

## అధిక వర్షాలు.. పంటల్లో జాగ్రత్తలు ఇలా..

**జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు**



కడప అగ్రికల్చర్ : మిచాంగ్ తుపాను వల్ల జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురిశాయి. దీంతో చాలా పంటల్లో వర్షపు నీరంతా నిలిచి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

**వరిపంట..**

వర్షానికి వరి చేను పడిపోయి నీట మునిగితే బూజు తెగులు వల్ల గింజ రంగు మారే అవకాశం ఉంటుంది. వర్షాలు తగ్గిన వెంటనే లీటరు నీటికి 1 మిల్లీలీటర్ ప్రొఫికొనజోల్ లేదా 1 గ్రాము కార్బెండిజమ్ లేదా 1 గ్రాము కార్బెండిజమ్ ప్లస్ మాంకోజెబ్‌ను కలుపుకుని పిచికారీ చేసుకోవాలి.

- కోత కోసి ఒదెలు వర్షానికి తడిచినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండేందుకు 5 శాతం ఉప్పు ద్రావణాన్ని ఒదెలపై పడే విధంగా పిచికారీ చేసుకోవాలి, ఒక వేళ పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే ఒదెలను గట్ల పైకి తెచ్చుకుని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి.
- వరిపంట నీట మునిగినప్పుడు ఎక్కువగా ఉన్న నీరు కాలువల ద్వారా తీసి వేయాలి. పంట పడిపోకుండా గుబురుగా దబ్బలను నిటారుగా ముడి వేసి కట్టాలి. దీని వలన గింజ తడవకుండా మొలక రాకుండా కాపాడుకోవచ్చు.
- మెట్ట పంటలైన పత్తి, మిరప పంటల చేనులలో వర్షపునీరు నిలవకుండా వర్షపు నీరు వేగంగా, సులభంగా వెళ్లిపోయే విధంగా చేలగట్లలో ఎక్కువ సంఖ్యలో వాలుకు నిలువుగా గండ్లు చేయాలి.
- పత్తిపంట 3వ కోతకు కాయలు విచ్చుకుని పత్తితీతకు సిద్ధమైన కాయల నుండి విచ్చుకున్న పత్తిని తీయడం మంచిది.
- అలాగే పంట నీట మునిగినప్పుడు కాలువల ద్వారా మురుగు నీటిని తీసివేయాలి. తరువాత 20 గ్రాముల యూరియా లీటరు నీటికి లేదా 19: 19:19 లేదా 13:0:45ను 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- మిరపలో తయారైన పచ్చి మిరప, పండు మిరపను చేను నుంచి కోసి అధిక వర్షాల నుంచి కాయలు తడవకుండా బూజు పట్టకుండా కాపాడుకోవచ్చు.
- శనగ పంటలో పంట నీట మునిగినప్పుడు మురుగునీరు తీసివేసి సీఎఫ్ 2.5 గ్రాములు లేదా టెబుకోనజోల్ 1 ఎంఎల్ లేదా హెక్సాకొనజోల్ 2 ఎంల్ లీటరు నీటికి పిచికారీ చేయడం వలన బ్యాక్టీరియా ఎండు తెగులు, వడలు తెగులు రాకుండా పంటను కాపాడుకోవచ్చు.
- ముఖ్యంగా ఉద్యాన పంటలలో పంట నీట మునిగినప్పుడు ఎక్కువ నీరు తీసివేయాలి. అరటి చెట్లు పడిపోకుండా ఉండేందుకు ప్రాపింగ్ చేసుకోవాలి. పండ్ల మొక్కలు, కూరగాయల పంటలకు యాంత్రీకరణ మద్దతు ఇవ్వడం వలన పంటనష్టం తగ్గించవచ్చు.
- పంట నీట మునగడం వలన లేదా అధిక తేమశాతం వలన పంటల్లో సూక్ష్మధాతు లోపాలు కనిపిస్తాయి. దీని నివారణకు తుపాను తగ్గిన తరువాత మైక్రోన్యూట్రిన్ స్ప్రే చేయాలి.
- తుపాను తగ్గిన తరువాత వెంటనే ఎరువులు, పురుగుమందు పిచికారీ చేయరాదు. అలాగే కోసిన పంటను పొలాల్లో అలాగే వదిలి వేయరాదని జిల్లా వ్యవసాయ అధికారి సూచించారు.